# దక్షులైన సభాధ్యక్షులు

ఇటీవల కాలంలో సాహితీ సంస్థలు, సారస్వత సమితులు, సంగీత సమాఖ్యలు, కళావాహినులు వంటివి, విరివిగా వెలుగులోకి వస్తున్నాయి. ఇవన్నీ ఎన్నో సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నాయి. శని, ఆదివారాలు వచ్చాయంటే, ఎక్కడో అక్కడ ఈ సభలు, సమావేశాలు జరుగుతూనే వుంటాయి.

ఏ సభకు ఎవరు అధ్యక్షత వహించినా, వందన సమర్పణ చేసేటప్పుడు మాత్రం సభా కార్యక్రమాన్ని క్రమశిక్షణతో నిర్వహించడంలో దక్షులైన సభాధ్యక్షులకు ముందుగా ధన్యవాదాలు – అనడం పరిపాటైపోయింది. ఈ నేపథ్యంలో కొంతమంది ప్రత్యేక తరహా అధ్యక్షుల గురించి మీకు మనవి చేస్తాను.

## అధిక ప్రసంగాధ్యక్షుడు

అదొక సాహిత్య సంస్థ వార్షిక సమావేశం! ఆ సమావేశానికి ప్రత్యేకాకర్షణ "నన్నయ కవితా వైశిష్ట్యము" అనే విషయంపై సాహిత్య ప్రసంగం – అని కరపత్రాలు పంచి పెట్టారు. అంతవరకు బాగానే ఉంది. "తోటి వారిని ప్రేమించు" అన్న సూక్తిని మన్నించాలని ఆ సంస్థ వారు, పొరుగూరి సాహితీ సంస్థ కార్యదర్శిని, ఆ వార్షిక సమావేశానికి అధ్యక్షునిగా ఆహ్వానించారు. ఆయన కూడా అంతో యింతో పాండిత్యం గల వారే! అదిగో – సాయంత్రం సమయం 7 గం॥లయింది. అరవై దాటిన అరవై డెబ్బై మందితో సభా ప్రాంగణం నిండుగ ఉంది. ప్రార్థనతో సభ ప్రారంభమైంది.

తదుపరి కార్యక్రమమైన అధ్యక్షుని తొలి పలుకుల కోసం, అధ్యక్షుల వారు లేచారు. సభ నిశ్శబ్దంగానే ఉంది! అయినా ఆయన "సభయే నమః! దయ చేసి నిశ్శబ్దంగా ఉండమని నా మనవి" అంటూ ఆగారు. ఒక్కసారి సభకేసి కలియచూసి, వెంటనే "శ్రీ వాణీ గిరిజాశ్చిరాయ" అంటూ గొంతెత్తి, ఉచ్చైస్వరంతో ఆ పద్యాన్ని రాగయుక్తంగా, గానం చేశాడు. క్షణం ఆగి, "భారతమును తెలుగు చేసినవాడు నన్నయ! ఆయన వ్యాస భారతమును యథాతథముగ తెలుగు చేయలేదు. అనేకములను వదలి వేసెను. కొన్నింటిని కల్పించెను. ఇది పద్యవిద్య పద్యరచన కాదు. తెలుగులో పద్యము రాయుటెట్లో – ఎట్లు రాసిన పద్యమగునో చేసి చూపించాడు. ఈ పద్యం వినండి! అంటూ "నిండు మనంబు నవ్యనవనీత సమానము" అనే పద్యాన్ని ఆసాంతం అప్పచెప్పే శాడు!

సభలో కొంచెం కలకలం బయలు దేరింది. దాంతో కొంచెం గొంతు పెద్దది చేశాడు!

"ఈ పద్యమును నిండు మనంబు శబ్దంతో మొదలు పెట్టుటకు బ్రహ్మ సృష్టి కారంభం" అంటూ ఆ ఒక్క పద్యానికే అర్ధ తాత్పర్య వ్యాఖ్యానాలతో అర్ధగంట సేపు అనర్గళంగా జనాన్ని తినేశాడు. దాంతో జనం కొంతమంది, సభాస్థలి నుంచి మెల్లగా బయటకు జారుకోసాగారు. అయినా అంతటితో ఆగక, "నానా రుచిరార్థ సూక్తి నిధి, నన్నయభట్టు తెనుంగుననే" అంటూ నన్నయ కవితావైశిష్ట్యం గురించి ఏకధాటిగ మరో అరగంట లాగించేశాడు. అప్పుడు సమయం తొమ్మిది గంటలు కావస్తోంది. జనం పల్చబడి పోయారు. అప్పటికి స్పృహ లోకి వచ్చాడు కాబోలు, తన ప్రసంగాన్ని ఆపు చేశాడు. కార్యక్రమ కరపత్రాన్ని తీసికొని, "ఇప్పుడు ప్రధాన వక్త శ్రీవారు 'నన్నయ్య కవితా వైదుష్యం' గురించి ప్రసంగిస్తారు" అంటూ గంభీరంగా పలికి ఆసీనుడయ్యాడు.

అప్పుడు – ప్రసంగం చేయవలసిన ప్రముఖ పండితుడు తన సీటులోంచి లేచి, మైకు దగ్గరకు వెళ్ళారు. అప్పటికి, కార్యకర్తలు కాక, మరో అరడజను మందే మిగిలారు. అయినా ఆయన, నిరాశ చెందక, "సభకు నమస్కారం! నన్నయ కవితా వైశిష్ట్యం గురించి ప్రసంగించవలసిందిగా ప్రత్యేకంగా నన్నాహ్వానించి, గౌరవించినందుకు సంతోషం. ఈ సందర్భంగా ఆ విషయంపై సభాధ్యక్షుల వారు చేసిన అధిక ప్రసంగం వినే మహద్భాగ్యం నాకు కల్గించినందుకు, మీకందరికి

నా ధన్యవాదములు. వారి ప్రసంగము సభను అలరింప చేసినదనుటకు, మిగిలిన ఈ ప్రేక్షకులే ప్రత్యక్ష సాక్షులు! అధ్యక్షుల వారి పాండితీ ప్రకర్షకు నా జేజేలు! సభ నుంచి నిష్క్రమించిన వారికి నా ధన్యవాదములు. మిగిలియున్న వారికి నా మనః పూర్వక నమస్సులు! స్వస్తి" అని కూర్చున్నారు.

అసహాయాధ్యక్షుడు

మరో సాహిత్య సంస్థ వారు - వారి సభకు ఓ ప్రభుత్వోద్యోగిని అధ్యక్షులుగా ఆహ్వానించారు. ఆయనకు అసలే సభాకంపము. దానికి తోడు సాహిత్య గంధం పూజ్యం! అయినా అధికార హోదాలో అంగీకరించాడు. సభా సంప్రదాయ ప్రకారం ప్రార్థనగీతాలాపన పూర్తయింది. అధ్యక్షుల వారు లేచారు. ధైర్యం కోసం సభలోని వారందరికేసి చూశారు. ఆడియన్సులో కూర్చున్న ఆఫీసు సిబ్బంది నవ్వు ముఖాల్తో కన్పించారు. గుండె చిక్కబట్టుకుని "సభకు మనస్కారం" అన్నారు!

ఇంతలో ఒక కార్యకర్త గబగబస్టేజి పై పోడియం మైకు ముందుకొచ్చి "అధ్యక్షుల వారి అనుమతితో ఒక చిన్న అనౌన్స్‌మెంటు! ఈ సభా కార్యక్రమానికి ఆర్థిక సహాయం అందించిన, శ్రీశ్రీ శ్రీనివాసరావుగార్ని ముందు వరసలో కొచ్చి కూర్చోవలసినదిగా మనవి చేసుకుంటున్నాం" అంటూ ఓ క్షణం ఆగి, ''ఇక మీరు ప్రారంభించండి!" అంటూ స్టేజి దిగిపోయాడు.

అధ్యక్షుల వారు మళ్ళా లేచి, మైకు పుచ్చుకొని "సభకు నమస్కారం! ఈ రోజు..." ఇంతలో మరొక కార్యకర్త స్టేజిపై కొచ్చి - మైకు ముందుకెళ్ళి "అధ్యక్షులవారి అనుమతితో ఒక ప్రకటన! ఆహ్వానితులందరికి టీ, బిస్కట్లు ఏర్పాటు చేయడమైనది. దయచేసి ఒక్కొక్కరే వరుసగా వరండాలో కెళ్ళి, మా ఆతిథ్యం స్వీకరించవలసిందిగా కోరుకుంటున్నాం" అంటూ స్టేజి దిగిపోయాడు.

అధ్యక్షుల వారు మళ్ళా లేచి మైకు పుచ్చుకుని మాట్లాడసాగారు. "సభకు నమ... ఈరోజు ... దినం... ఈకార్యక్రమ..."

ఠపీమంటూ ఒక కార్యకర్త గబగబా సరాసరి అధ్యక్షులవారి దగ్గరకొచ్చి, ఆయన చేతిలో మైకు లాక్కొని, "అధ్యక్షుల వారి అనుమతితో ఈ మైకు సరిగా పని చేయడం లేదు, మరొక మైకు ఏర్పాటు చేస్తామని మనవి చేస్తున్నాను" అంటూ బిగ్గరగా చెప్పి ఆ మైకు తీసికొని పక్కకెళ్ళిపోయాడు.

అధ్యక్షుల వారు యథాప్రకారం మళ్ళా కుర్చీలో కూలబడ్డారు. ఇంతలో ఆ కార్యకర్తే మరో మైకు లాక్కొచ్చి, "హల్లో... హల్లో... మైక్ టెస్టింగ్.. వన్ టూ త్రీ... వన్ టూ త్రీ..." అంటూ టెస్ట్ చేసి " ఆ! ఇక మీరు మాట్లాడండి సార్!" అంటూ ఆర్డరేసి స్టేజి దిగి పోయాడు.

"అధ్యక్షుల వారు బిక్కుబిక్కుమంటూ లేచారు. కొత్త మైకు చేత్తో పుచ్చుకొని, తత్తరపాటు కనపడకుండా, మళ్ళీ ప్రారంభించారు. "సభకు నమస్కారం! ఈ రోజు చాలా సుదినం. ఎందుకంటే నాకు కొత్త మైకు యిచ్చారు".

ఇంతలో రెండో సారి వచ్చిన కార్యకర్తే మళ్ళా వచ్చి, పోడియం దగ్గర మైకు పుచ్చుకొని "అధ్యక్షుల వారి అనుమతితో ఒక సవరణ! ఇంత క్రితం ప్రకటనలో ఒక చిన్న పొరపాటు దొర్లింది. సభానంతరం టీ, బిస్కట్లు అని చెప్పడం మర్చిపోయాం! అందుకు మన్నించాలి. ఇప్పటికే వరండాలోకి వెళ్ళిన వారంతా దయచేసి లోపలికొచ్చి కూర్చోవలసిందిగా మనవి చేస్తున్నాం! దయచేసి లోనికి రండి! లేదా వెళ్ళిపోండి! అంతేకాని వరండాలో మాత్రం నిలబడరాదని మనవి చేసుకుంటున్నాను'' అంటూ స్టేజి దిగిపోతూ అధ్యక్షుల వారిని మాట్లాడమన్నట్టు చేత్తో సౌంజ్ఞలు చేశాడు.

అప్పటికే సభ మొదలై అరగంట దాటి పోయింది!

> **నిర్ణయం**
>
> 'నిన్న' అనే పునాది మీద
>
> 'ఈరోజు' తయారు చేసుకున్నాను!
>
> 'రేపటి'కి ఏమీ మిగల్లేదు!
>
> ఇంకా కష్టపడాలి!!
>
> -జి. విజయశ్రీ

అధ్యక్షుల వారు మళ్ళా లేచారు. కొత్తమైకు చేత్తో పుచ్చుకున్నారు. మళ్ళా ప్రసంగం ప్రారంభించారు!

"సభకు నమస్కారం! ఈ రోజు చాలా సుదినం! ఎందుకంటే నాకు కొత్త మైకు యిచ్చారు! ఈ మైకుతో మాట్లాడుతుంటే!

ఠప్పున కరెంటు పోయింది. అంతా చీకటి! అంధకారం! "టార్చిలైటు! టార్చిలైటు" అంటూ ఎవరో అరుస్తున్నా ఆ చీకట్లో ఎవరూ వినిపించుకోలేదు. ఇంతలో నిత్యాగ్ని హోత్రుడు – ఒకాయన అగ్గిపుల్ల వెలిగించి క్షణకాలం వెలుగు ప్రసాదించాడు! ఆ వెలుగులోనే, ఎవరో ఒకాయన – "క్యాండిల్ .. క్యాండిల్స్ తెమ్మన్నా.. తేలేదా?" అంటూ కోపంగా అరుస్తున్నాడు. ఎక్కణ్నించీ సమాధానం రాలేదు. దాంతో ఇంకొకాయన "లాభం లేదు, కరెంటాఫీసుకు ఫోను చేయండి! ... ఎవరిదగ్గరన్నా సెల్లుందా? ఆ ఉంటే... 222374కు ఫోను కొట్టండి! పవర్ ఫెయిలా? ... కరెంటు కోతా?... అడగండి. అంటూ ఆదేశిస్తున్నాడు. అదృష్టం. ఎవరో మహానుభావుడి దగ్గరా, మిణుగురు పురుగులా మినకుమినుకుమంటూ సెల్‌ఫోన్ లైటు వెలుగు కన్పించింది.

"హల్లో... హల్లో... కరెంటాఫీసాండి... ఇక్కడ టౌన్ హాల్ లైన్లో సప్లైయి పోయిందండి! పవర్ ఫెయిల్యూరా! ఏవంటున్నారు? వినపడ్డం లేదు.. గట్టిగా చెప్పండి. లైన్ పోయిందా! అదేనండి! ఇక్కడి లైన్ పోయింది. ఏమిటి? మొత్తం టౌనంతా పోయిందా? ఏమిటి? పైనుంచే సప్లై పోయిందా? ఎంత సేపట్లో వస్తుందంటారు? ఏంటీ? ఇక ఈ రాత్రికి రాదంటారా?.. చాల్లెండి... సంతోషించాం...! యిక పెట్టేయండి... చావుకబురు చల్లగా చెప్పారు" అంటూ సెల్ ఆఫ్ చేసి "అయ్యా పై నుంచే కరెంటు లైను ఫెయిలయిందిట. ఈ రాత్రికి రాదట. పెట్రొమాక్సు లైటుందేమో చూడండి!" అంటూ ఆ చీకట్లోనే అరిచాడు.

అంతా గందరగోళంగా తయారయింది. అప్పటికి మరో అరగంట పైనే గడిచింది! అప్పుడో కార్యకర్త స్టేజి పైకి ఎక్కి ఓ అగ్గిపుల్ల వెలిగించి "అధ్యక్షుల వారి అనుమతితో సభ యింతటితో ముగిసిందని ప్రకటిస్తున్నాం. జైహింద్" అంటూ గొంతెత్తి బిగ్గరగా అరిచాడు.

**అదృష్ట జాతకాధ్యక్షుడు**

ఓ ఊళ్లో ఓ ప్రముఖ వ్యక్తి పరమపదించారు. వారి స్మృత్యర్థం ఆయన చిన్ననాటి మిత్రుని అధ్యక్షతన సంతాప సభ ఏర్పాటైంది. కాని ఆఖరి సమయంలో ఆ మిత్రుడికి గుండెనొప్పి వచ్చి, ఆసుపత్రి పాలయ్యాడు. ఏం చేయాలో తోచక, కార్యనిర్వాహకులు అప్పటికప్పుడు ఆదరబాదరాగా మరొకాయన్ని బ్రతిమాలారు. ఆయనకు సభల్లో మాట్లాడాలనే కండూతి మెండు! అందుకని అధ్యక్షులుగా ఉండేందుకు వెంటనే అంగీకరించేశాడు!

సభ ప్రారంభమైంది. దివంగత వ్యక్తి ఫొటోకి దండలేశారు. అంతా రెండు నిముషాలు మౌనం పాటించారు. ఆ తర్వాత స్వర్గస్థులైన ఆ మహానుభావుడి గురించి, అధ్యక్షులు ప్రసంగించాలి! అందుకోసం అధ్యక్షుడు కుర్చీలోంచి లేచాడు. ఎప్పుడు ఎక్కడ సభ ప్రారంభించినా, "చాలా సంతోషం" అంటూ ప్రారంభించడం ఆయన కలవాటు! అందుకనే గొంతు సవరించుకొని, విచారంగా మొహం పెట్టి, "చాల సంతోషం, ఈ రోజు భలానా వారు పరమపదించారని మీకందరకు తెలుసు! చాలా సంతోషం! వారి గురించి నాకంతగా తెలీదు. పరమపదించారు కాబట్టి, బహుశా వారు చాలా యోగ్యులు, గొప్పవారు అయి ఉంటారు. ఎందుకంటే గొప్ప గొప్ప వాళ్ళు, యోగ్యులు, పుణ్యాత్ములే పరమపదిస్తుంటారు. ఏది ఏమైనప్పటికీ, అలాంటి వారు స్వర్గస్థులవడం – ఇలాంటి కార్యక్రమం మనం జరుపుకోవడం చాలా ముదావహం! నిజానికి ఈ కార్యక్రమం నా అధ్యక్షతన జరగడం నా అదృష్టజాతకంగా భావిస్తున్నాను. జైహింద్" అంటూ తనే చప్పట్లు కొట్టుకున్నాడు.

అయ్యా! ఇలాంటి అధ్యక్షులెక్కడైనా తారసపడితే అది నా తప్పుకాదని మనవి!

**–సోమంచి రామం**